క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే ప్రతాప్ ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం నూజివీడు మండలం రామన్నగూడెం, పోలసానపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. సాయంత్రం ఐదు గంటల నుంచి ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తారని, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు విజ్ఞప్తి చేశాయి.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎంపీడీఓ అనూరాధ



ఇబ్రహీంపట్నం: వేసవిలో తాగునీటి ఎద్దడి, వడదెబ్బ నివారణ చర్యలపై ఎంపీడీఓ అనూరాధ వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలో 135 చేతిపంపులు ఉండగా 25 రిపేరులో ఉన్నాయన్నారు. వివిధ గ్రామాల ఎంపీపీ పాఠశాలల్లో 8 చేతి పంపులు ఫ్లషింగ్ చేయాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పీహెచ్‌సీ వైద్యురాలు వివరించారు. ఉపాధి హామీ పథకం కూలీలు ఉదయం, సాయంత్ర వేళల్లో పనులకు హాజరుకావాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు దగ్గర ఉంచుకోవాలని చెప్పారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



ఏ.కొండూరు: తిరువూరు పట్టణానికి చెందిన సయ్యద్ అబిదా ఖాతూన్(ఆరిఫ్ అహ్మద్) పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా నిరుపేద ముస్లిం మహిళలకు, వితంతువులకు, వృద్ధులకు రంజాన్ తోఫాను తిరువూరులో మంగళవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ మాసంలో నిరుపేద మహిళలకు తన వంతు సాయం అందిస్తున్నామని చెప్పారు.

దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: వైకల్యాన్ని అధిగమించి జీవితంలో అనుకున్న లక్ష్యాలను ధైర్యంగా సాధించాలని దీపక్ నెక్స్‌జెన్ ఫుడ్ అండ్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. తోటపల్లి హీల్ అవయవ కేంద్రంలో ముగ్గురు దివ్యాంగులకు ఆయన కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, కార్యదర్శి తాతినేని లక్ష్మి, దీపక్ నెక్స్ జెన్ కంపెనీ డైరెక్టర్లు చైతన్య, అక్కినేని వెంకట శేషాద్రి పాల్గొన్నారు.

మైలవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మైలవరం: మైలవరం బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఏడీ ప్రసాద్ ఎన్నికయ్యారని అసోసియేషన్ మీడియా కమిటీ కన్వీనర్ బుద్దవరపు వెంకట్రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానిక బార్ అసోసియేషన్ హాల్లో జరిగింది. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా వీటీ కిషోర్, ఉపాధ్యక్షుడిగా వీవీ సాంబశివరావు, సహాయ కార్యదర్శిగా ముల్లంగి రవికుమార్, లైబ్రేరియన్‌గా బి. దినేష్, కోశాధికారిగా టి.కోటేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా నాగులూరి భావన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారన్నారు. అదే విధంగా మీడియా కన్వీనర్‌గా బుద్దవరపు వెంకట్రావు, క్రమశిక్షణ కమిటీ, మానవ హక్కుల కమిటీ, బిల్డింగ్ అభివృద్ధి కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎందుకు బాబు.. మాపై ఇంత కక్ష?

- వృద్ధులపై టీడీపీ కక్షపూరిత నిర్ణయం
- ఇంటికి వచ్చే పింఛన్లు ఆపుతావా అంటూ వృద్ధుల ఆగ్రహం
- చంద్రబాబుకు మా ఉసురు తప్పదంటూ విమర్శలు



జి కొండూరు మండలం వెల్లటూరు లబ్ధిదారుడికి విజయవాడ వైద్యశాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మారాసి సుభాషిణి (ఫైల్)



మైలవరంలో వలంటీర్ ద్వారా పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారు (ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఆదరణ కరువై జీవితాలు భారంగా నెట్టుకొస్తున్న అభాగ్యుల జీవితాల్లో వైఎస్సార్ పింఛన్ కానుక వెలుగులు నింపుతోంది. నాలుగున్నరేళ్లుగా అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర సామాజిక పింఛనుదారులు ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా ఇంటివద్దే పింఛను అందుకుంటున్నారు. మొదటి నుంచి వలంటీర్ వ్యవస్థపై విషం కక్కుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు కేంద్ర ఎన్నికల సంఘం, కోర్టును తన కోవర్టులతో ఆశ్రయించాడు. ఎన్నికల నియమావళి పేరుతో వలంటీర్లను పింఛన్ల పంపిణీకి దూరంగా ఉంచాలని ఉత్తర్వులు తీసుకొచ్చారు. ఈ పరిణామాల మధ్య ఏప్రిల్ నెలలో వలంటీర్లు అవ్వాతాతల ఇంటికెళ్లి పింఛన్లు ఇచ్చే అవకాశం లేకుండా చంద్రబాబు చేయించారు. టీడీపీ నాయకులు కుట్ర కోణంతో పింఛనుదారులు గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి తీసుకునే పరిస్థితిని తీసుకొచ్చారు. ప్రచార మాధ్యమాల ద్వారా టీడీపీ కుట్ర తెలుసుకున్న లబ్ధిదారులు టీడీపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులపై ఎందుకింత కక్ష చంద్రబాబు అంటూ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జగన్ ప్రభుత్వంలో ఒకటో తేదీనే పంపిణీ ..

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, వృత్తి పనులు చేసుకునే అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా వైఎస్ జగన్ ప్రభుత్వం పింఛన్లు ఇచ్చి అండగా ఉంటోంది. ప్రతి నెలా ఠంఛన్‌గా ఒకటో తేదీన రూ.3 వేలు పింఛన్‌ను ఇంటివద్ద అందించడంతో పాటు అనారోగ్య కారణాలతో వైద్యశాలల్లో చికిత్స పొందుతున్న వారికి ఆస్పత్రులకు వెళ్లి పింఛను సొమ్ము అందించేవారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 4,81,824 మందికి ప్రతి నెలా రూ.144.54 కోట్ల నగదును ప్రభుత్వం పింఛనుగా చెల్లిస్తోంది. అవ్వాతాతల కళ్లల్లో ఆనందాన్ని భరించలేని చంద్రబాబు ఏప్రిల్ నెలలో వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా ఉత్తర్వులు తెచ్చి తనపంతం నెగ్గించుకున్నాడు.

గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో అవస్థలు

గత టీడీపీ ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందకుండా జన్మభూమి కమిటీలు అడ్డుకున్నాయి. అర్హత ఉన్నా ముడుపులు చెల్లిస్తేనే మంజూరు చేసేవారు. ప్రతి నెలా పింఛను పొందేందుకు గ్రామ పంచాయతీల వద్ద పడిగాపులు పడేవారు. పింఛను కోసం ఎండలో నిల్చోలేక స్పృహతప్పి పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. నూతన పింఛను మంజూరు కావాలంటే తీసుకునే వారిలో ఎవరైనా ఈలోకం విడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. టీడీపీ హయాంలో పింఛను పొందేందుకు పడుతున్న పాట్లను ప్రజా సంకల్ప యాత్రలో తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్దనే లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో సచివాలయం, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. నూతన పింఛన్లకు అర్హతనుబట్టి వలంటీర్లే ఇంటికెళ్లి అర్జీ పూర్తిచేసి సచివాలయంలో అందిస్తారు. 1–3 నెలల మధ్య పింఛన్ మంజూరు చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో 2,45,783 మందికి రూ.73,73,49,000, ఎన్టీఆర్ జిల్లాలో 2,36,041 మందికి రూ.70,81,23,000 నగదును ప్రతి నెలా చెల్లిస్తున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



నాలుగేళ్లుగా పింఛను పొందుతున్నాను. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండటం వలన సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. మాకు పింఛను రూ.3 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. మళ్లీమళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుంటాం.

– బి.వాలీ, కిలేశపురం, ఇబ్రహీంపట్నం

ఇంటివద్దకే పింఛన్ పంపిన జగన్



గతంలో పింఛను తీసుకునేందుకు అనేక కష్టాలు పడ్డాం. ప్రస్తుతం వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. ఈ నెలలో పింఛను పంపిణీకి వలంటీర్లను టీడీపీ దూరం చేయడంతో వారి పతనాన్ని వారే కొనితెచ్చుకుంటున్నారు. టీడీపీ నేతల మాటలు నమ్మే స్థితిలో ప్రజలు లేరు. మరలా సీఎంగా జగన్ రావాలి.

– బాణావత్ లక్ష్మణ, లబ్ధిదారుడు, జూపూడి, ఇబ్రహీంపట్నం

ఇచ్చిన హామీలు అమలు చేసిన జగన్



తిరువూరులో ప్రచారం చేస్తున్న సుధారాణి, నాయకులు

తిరువూరు: ప్రజా సంకల్పయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. తిరువూరు 9వ వార్డులో మంగళవారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నవరత్నాలతో పేదలందరికీ లబ్ధి చేకూరిందని, ఇచ్చిన హామీలతో పాటు అదనంగా ప్రజల అవసరాలను గుర్తించి నేరుగా ఆర్థికసాయం అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసే పెన్షన్లను వలంటీర్లు పంపిణీ చేయకుండా తెలుగుదేశం నాయకులు అడ్డుకోవడం విచారకరమన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు మూడు దుర్గారావు, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, పరసా సత్యనారాయణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, పార్టీ నాయకులు పరసా నెహ్రూజీ, దుర్గారావు, నల్లబోతుల సీతారావమ్మ, రాజ్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొర్రా కిరణ్



మైలవరం: మైలవరం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బొర్రా కిరణ్‌ను ఆ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు బొర్రా కిరణ్‌ను అభ్యర్థిగా ఎంపిక చేశారు. బొర్రా కిరణ్ కొండపల్లిలో నివాసం ఉంటున్నాడు.

ద్విచక్ర వాహనాలు మాయం

పెనుగంచిప్రోలు: గడిచిన వారం రోజుల వ్యవధిలో గ్రామంలో ద్విచక్ర వాహనాలు మాయమవుతున్న ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు నాలుగు బైక్‌లు మాయం కాగా, తాజాగా సోమవారం మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్ వెనుక సందులో బుల్లెట్ కూడా గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. అయితే వీటికి సంబంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెండు ఫిర్యాదులు మాత్రమే అందాయని పోలీసులు తెలిపారు. బుల్లెట్ వాహనం తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ కెమేరాలో రికార్డు అయ్యాయి. అయితే తీసుకెళ్తున్న వ్యక్తి ముఖం స్పష్టంగా కనిపించటం లేదు. వరుస దొంగతనాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): మండలంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టంగా తనిఖీలు చేస్తున్నామని నందిగామ రూరల్ సీఐ చంద్రశేఖర తెలిపారు. మండలంలోని పెద్దాపురం గ్రామ సమీపంలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోకి వచ్చే ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా మద్యం, నగదు, మాదకద్రవ్యాలు, తదితరాలు అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మహాలక్ష్మణుడు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి



పార్టీ శ్రేణులతో సమావేశమైన హర్షవర్ధన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్ర హర్షవర్ధన్‌రెడ్డి, అప్పిడి కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కిలేశపురం, తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పార్టీ పరిస్థితి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, సర్నాల తిరుపతిరావు విజయానికి సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు పోల్ మేనేజ్‌మెంట్‌లో చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, సచివాలయాల మండల కో–ఆర్డినేటర్ కోసూరు వెంకటేష్, ప్రజాప్రతినిధులు, గ్రామాల పార్టీ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు
- వైఎస్సార్ సీపీలో 30 కుటుంబాల చేరిక



పార్టీ కండువా కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న స్వామిదాసు

విస్సన్నపేట: పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించి పేదల పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. స్థానిక మాజీ వైస్ ఎంపీపీ ఓలేటి దుర్గారావు నివాసం వద్ద సోమవారం రాత్రి వివిధ పార్టీల నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో స్వామిదాసు సమక్షంలో చేరారు. పలువురు ముస్లిం మైనార్టీలు, ఎస్సీవాడలోని కొందరు వైఎస్సార్ సీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు ముత్యాలరావు, కో–ఆప్షన్ సభ్యుడు జాఫర్‌బాబా, ఎంపీటీసీ సభ్యుడు జి. మల్లయ్య, మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, నాయకులు పిల్లి రాజేష్, నాని, మేకల రవి, కోటా శ్రీను, బాజీబాబా, లాలయ్య పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్



శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు

ముసునూరు: యువకుల చొరవ, దాతల సహకారంతో ముసునూరులోని దళితుల శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు నిర్వహించారు. ముసునూరులోని దళితవాడ శ్మశానవాటిక తుమ్మ, జిల్లేడు చెట్లు, ముళ్లకంపలతో నిండి మృతదేహాలను ఖననం చేయడానికి వీలులేనంతగా మారింది. ఇటీవల ఓ మృతదేహాన్ని ఖననం చేసేందుకు వెళ్లిన యువకులు శ్మశానవాటికలో సమస్యను గుర్తించి రైతు ప్రముఖులు రేగుల బ్రదర్స్ గోపాలకృష్ణ, లోకేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన రేగుల బ్రదర్స్ మంగళవారం జేసీబీతో శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. శ్మశానవాటిక అంతర్గత రహదారుల్లో గోతులను సైతం పూడ్పించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన రేగుల బ్రదర్స్, యువకులు గొల్లపల్లి సురేష్, మద్దాల బాబూరావు, రమేష్, రామారావు, గంగాధర్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన శ్రీ కోదండరామ, దాసాంజనేయ, ముత్యాలమ్మ, అంకమ్మ, గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ, యల్లయ్య, నాభిశిల ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం విష్వక్సేనారాధన, పుణ్యాహవాచన, పంచామృత స్నపన, సామూహిక కుంకుమపూజ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధాన్యాధివాసం, పుష్పాధివాసం, ప్రభూతభలి, గమిడి దిగ్బంధన వంటి కార్యక్రమాలు చేశారు. ప్రతిష్ఠా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలోని ప్రతి ఇల్లు బంధువులతో నిండిపోయింది. దూరప్రాంతాలలో స్థిరపడిన వారు గ్రామానికి చేరుకున్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమం జరుగనుంది. ఎస్‌ఐ బి.అభిమన్యు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రేపటి నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 తేదీ నుంచి కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రెస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్, జ్యూస్ అండ్ జామ్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 నెంబర్‌లో కాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

నేషనల్ క్రికెట్ అకాడమీకి విద్యార్థి ఎంపిక



రాజేష్‌కు షూస్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డీఆర్‌కె.ప్రసాద్, కోచ్ రాజేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అమ్మాణీ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం చదువుతూ స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలో బీవీ సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏసీఏ, కేడీసీఏ క్రికెట్ అకాడమీ నెట్స్‌లో ఐదేళ్లుగా శిక్షణ పొందుతున్న నల్లపు రాజేష్ నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. ఇటీవల అస్సాం గౌహతిలో జరిగిన అండర్–16 ఆలిండియా బీసీసీఐ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు నల్లపు రాజేష్ ప్రాతినిధ్యం వహించాడు. ఈ టోర్నమెంట్‌లో హాఫ్ స్పిన్ బౌలర్‌గా 30 వికెట్లు తీసుకోవడం వలన నేషనల్ క్రికెట్ అకాడమీకి ఎంపికయ్యాడు. కాగా ఈ నెల 18వ తేదీ నుంచి మే 18 వరకు ముంబాయిలో జరుగనున్న శిక్షణా కార్యక్రమంలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం నల్లపు రాజేష్‌కు ఆశిస్ జాగర్స్ షూస్‌ను స్థానిక లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్ అందజేశారని కోచ్ రాజేంద్ర తెలిపారు.

నూజివీడు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మరీదు కృష్ణ



నూజివీడు: రానున్న ఎన్నికల్లో నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా మంగళవారం ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ తరపున మరీదు కృష్ణను ఆ పార్టీ నూజివీడు మండలం మీర్జాపురానికి చెందిన మరీదు కృష్ణ గతంలో ఎంపీపీగా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో మరీ దు కృష్ణ బీజేపీలో చేరారు. 2001 నుంచి 2006 వరకు కాంగ్రెస్ పార్టీ తరపున నూజివీడు ఎంపీపీగా పనిచేసిన మరీదు కృష్ణ 2019 వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నారు. 9వ తరగతి వరకు చదువుకున్న మరీదు కృష్ణ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎన్నికల్లో మద్యం పంపిణీకి స్వస్తి పలకాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉచితంగా మద్యం పంపిణీకి స్వస్తి పలికి ఓటర్లు, కార్యకర్తలు, యువతను కాపాడాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వేచ్ఛాయుత ఎన్నికలు–మద్యం ప్రభావం–నియంత్రణ మన ముందున్న సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఉచితంగా మద్యం పంపిణీ వల్ల యువతకు మద్యం అలవాటు అవుతుందన్నారు. అభ్యర్థులు ఖర్చు పెట్టే వ్యయంలో 25 శాతం మద్యం పంపిణీకే కేటాయిస్తున్నారని తెలిపారు. తాగుడు తప్పు అనే భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడారు.

కనీస వేతనం ఇవ్వాలి

తిరువూరు: రాష్ట్ర ప్రజా రవాణా శాఖలో అద్దె బస్సులపై డ్రైవర్లుగా పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు ఇవ్వాలని అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. తులసీరాం ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవన్‌లో అద్దె బస్సు డ్రైవర్ల యూనియన్ సమావేశం జరిగింది. నెలకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ నిబంధనల మేరకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని కోరారు. యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, రవి, మధుబాబు, మణికంఠ, రాధాకృష్ణ, భద్రం పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



నందిగామ: ఎన్నికల నేపథ్యంలో అనవసరంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ బి.రవికిరణ్ హెచ్చరించారు. నందిగామ పట్టణంలోని మెయిన్ బజార్‌తో పాటు పలు ప్రధాన వీధులలో మంగళవారం రాత్రి ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకే ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో ధైర్యం నింపేందుకే పోలీసు కవాతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అనవసరంగా వివాదాలకు పాల్పడి ఇబ్బందులు పడవద్దని సూచించారు. ఈ కవాతులో ఇన్‌స్పెక్టర్ హనీష్, ఎస్‌ఐ పండుదొర, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నారు.

నేడు పెన్షన్ల పంపిణీ

తిరువూరురూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు బుధవారం ఉదయం పెన్షన్లను పంపిణీ చేస్తామని తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు పెన్షన్లను సచివాలయ సిబ్బంది అందజేస్తారన్నారు. మండలంలో 6,975 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 7 లక్షల మేర నగదు పంపిణీ చేస్తారని వివరించారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం

విస్సన్నపేట: నూతిపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ ఆంజనేయ జయ విజయ శిఖర శిలా ధ్వజ గ్రామ నాభిశిల, ముత్యాలమ్మ దేవతామూర్తులు, యంత్ర స్థిర ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం 9.18 గంటలకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com

తృతీయ వర్ధంతి



కీ.శే. మల్లెల ఘన్నమ్మ గారు
మైలవరం
జననం : 1942, మరణం : 3-4-2021
భర్త :
మల్లెల వెంకటేశ్వరరావు
ఫోన్ : 99128 54764
మరియు కుటుంబ సభ్యులు

అశ్రునివాళి



మాటలో మన్నన
మనసులో వెన్న
మంచికి మరోపేరు
మానవత్వానికి మరో పేరు
నీతి, నిజాయితీ గల
మా తండ్రి గారైన
డి. 25-03-2024
సోమవారం
స్వర్గస్థులైనారని
తెలియజేయుటకు
చింతిస్తున్నాము.
డి. 04-04-2024
గురువారం
తిరువూరులోని మా స్వగృహము
నందు పెద్దకర్మ జరుపబడును
భార్య: చావిడి రమాదేవి
కీ.శే. చావిడి వెంగయ్య గారు B.Sc., B.Ed.,
విజయబాలనికేతన్ రిటైర్డ్ హెడ్ మాస్టర్
జననం: 01-07-1949 మరణం: 25-03-2024
కుమారులు-కోడలు
మనుమరాలు: నాగశ్రీ అనన్య
కుమార్తెలు-అల్లుళ్ళు
నట్టా ప్రసన్న లక్ష్మి-విద్యాధర్